సీసీ రోడ్డు పనులు ప్రారంభం

సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ

మణికొండ, ఆగస్టు 29: అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంతో పాటు సకాలంలో పూర్తి చేయాలని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణశ్రీనివాస్ సూచించారు. మంచిరేవులలో 50 లక్షలతో గురువారం సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కురుస్తున్న వర్షాలకు రోడ్లు బాగా దెబ్బతిన్నాయన్నారు. గోతులమయంగా మారిన రోడ్లపై ప్రయాణం ప్రమాదకరంగా మారిందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని నూతన సీసీ రోడ్లకు నిధులను మంజూరు చేయించామన్నారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ఆక్రమణలపై ఫిర్యాదు చేస్తున్న ది సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు

మణికొండ, ఆగస్టు 29: మణికొండ ది సిటిజన్స్ కౌన్సిల్ ఆధ్వర్యంలో జనరల్ సెక్రటరీ షేక్ ఆరిఫ్ మొహ్మద్, జాయింట్ సెక్రటరీ ఉపేంద్రనాథ్‌రెడ్డి గురువారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిశారు. మణికొండ,నెక్నాంపూర్ సర్వే నెంబర్ 20లోని ప్రభుత్వ భూముల ఆక్రమణ, పబ్లిక్ వనరులు, స్థలాలపై జరుగుతున్న అక్రమ కార్యకలాపాలను తక్షణమే ఆపాల్సిన అవసరాలను సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు ఆయనకు వివరించారు. సరస్సులు, పార్కులు, కమ్యూనిటీహాల్స్ బఫర్ జోన్, ఫుల్ ట్యాంక్ లెవెల్ ప్రాంతాల ఆక్రమణలపై వివరించారు. హైడ్రా కమిషనర్ సమస్యల తీవ్రత గమనించి ప్రజల ప్రయోజనం కోసం ప్రభుత్వ భూములు, స్థలాల రక్షణ, పరిరక్షణ కోసం కట్టుబడి ఉన్నామని కమిషనర్ తెలిపినట్లు పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్య

బండ్లగూడ,ఆగస్ట్ 29: పిల్లలు కలగడం లేదని ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ప్రేమావతిపేట్ భవానీ కాలనీలో నివాసం ఉంటున్న స్వాతి వివాహం జరిగిన నాటి నుంచి పిల్లలు కలగడం లేదని తీవ్ర మనస్తాపానికి గురైంది.బుధవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

నిమజ్జనానికి చెరువుల పరిశీలన

పల్లెచెరువును పరిశీలిస్తున్న అధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులు

పత్తికుంటను పరిశీలిస్తున్న డీసీపీ శ్రీనివాస్

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 29: గణేశ్ ఉత్సవాల నేపథ్యంలో విగ్రహాల నిమజ్జనానికి చెరువుల వద్ద అభివృద్ధి పనులను నిర్వహిస్తున్నామని రాజేంద్రనగర్ సర్కిల్ ఉపకమిషనర్ రవికుమార్ సూచించారు. గురువారం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని పల్లెచెరువును వివిధ శాఖల అధికారులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఆయన సందర్శించి పరిశీలించారు. పల్లెచెరువులో గణేశ్ నిమజ్జనాలు భారీ ఎత్తున జరుగుతాయన్నారు. స్థానిక ప్రాంతాలతో పాటు నగరం నుంచి గణేశ్ విగ్రహాలను తీసుకువచ్చి ఇక్కడ నిమజ్జనం చేస్తారన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా భారీ ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. వీధిలైట్లు, క్రేన్‌లు, తాగునీటి సదుపాయం తదితర వసతులు చేపడుతామన్నారు. డీసీపీ శ్రీనివాస్, డిప్యూటీ ఎస్‌డబ్ల్యూఎం, ఈఈ, గణేశ్ ఉత్సవ కమిటీ స భ్యులు మల్లారెడ్డి, మల్లేశం, కొమురయ్య, రామేశ్వర్, ధనుంజయ్ పాల్గొన్నారు.

పత్తికుంట చెరువు పరిశీలన..

బండ్లగూడ,ఆగస్ట్ 29: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో గణేశ్ ఉత్సవాల నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖల అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా రాజేంద్రనగర్ డీసీపీ శ్రీనివాస్, జీహెచ్ ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్న, డీసీ రవికుమార్‌లతో పాటు స్థానిక నాయకులతో కలిసి సర్కిల్ పరిధిలోని పత్తికుంట, పల్లె చెరువులను పరిశీలించారు.ఈ సందర్భంగా వినాయకుల ఏర్పాట్లతో పాటు నిమజ్జనం వరకు తీసుకోవలసిన చర్యలు గురించి చర్చించారు. నిమజ్జనానికి అవసరమైన క్రేన్‌లు,నిమజ్జనాన్ని వీక్షించేందుకు వచ్చే భక్తులకు సమస్యలు రాకుండా చేపట్టవలసిన జాగ్రత్తల పై చర్చించారు.

విద్యార్థినులకు ల్యాప్‌లాప్‌లు అందజేత

ల్యాప్‌లాప్‌లు అందజేసిన రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ ప్రతినిధులు

జూబ్లీహిల్స్,ఆగస్టు 29: పోటీ ప్రపంచంలో అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకునేందుకు విద్యార్థులకు డిజిటల్ వనరులు, ఆన్‌లైన్ లర్నింగ్ ఉపకరణాలు ఉపయుక్తంగా ఉంటాయని రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ అధ్యక్షుడు బాలకోటి రెడ్డి అన్నారు. గురువారం రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్, బీజీఆర్ మైనింగ్ అండ్ ఇన్‌ఫ్రా లిమిటెడ్‌తో కలిసి నగరంలోని వెస్ట్ మారేడ్‌పల్లి డాక్టర్ మునగా రామోహన్‌రావు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఉచితంగా ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. రోటరీ అసిస్టెంట్ గవర్నర్ శాంతి ప్రియా మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని మరింత రాణించాలన్నారు. స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాన్ని నిర్వహించినందుకు రొటేరియన్ డాక్టర్ రామోహన్‌రావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ ఆఫ్ జూబ్లీహిల్స్ రొటేరియన్లు సురేశ్ కుమార్, నరేశ్, అభిషేక్, శ్రీదేవి, లక్ష్మి విసిరెడ్డి, భార్గవి, చొక్కా లింగం తదితరులు పాల్గొన్నారు.

సీవరేజీ పనులు చేపట్టాలి

అనూషకు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి

జూబ్లీహిల్స్,ఆగస్టు29: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా రహ్మత్‌నగర్ డివిజన్‌లో వాటర్, సీవరేజీ లైన్ల ఆధునీకరణ చేపట్టాలని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి కోరారు. ఈ మేరకు గురువారం ఖైరతాబాద్‌లోని జలమండలి కార్యాలయంలో వాటర్ వర్క్స్ ఫైనాన్స్ మేనేజర్ అనూషకు ప్రతిపాదనల ప్రతిని అందజేశారు. సంబంధిత ప్రతిపాదనలను జలమండలి ఎండీ దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుతో పాటు పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరారు

దోమల నివారణకు ఫాగింగ్

జూబ్లీహిల్స్,ఆగస్టు 29: దోమల నివారణకు ఫాగింగ్ తప్పనిసరిగా చేపట్టాలని జీహెచ్‌ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా అధికారులకు సూచించారు. గురువారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో చేపట్టిన ఫాగింగ్ పనులను ఏఎంఓహెచ్ డాక్టర్ సాల్మన్, ఎంటమాలజీ ఏఈ సావిత్రితో కలిసి పరిశీలించారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

నారాయణగూడలో ర్యాలీ నిర్వహిస్తున్న జాహ్నవి విద్యాసంస్థల విద్యార్థినులు

హిమాయత్‌నగర్,ఆగస్టు29: కోల్‌కత్తాలో ట్రైనీ వైద్యురాలిని అత్యంత దారుణంగా హత్య చేయడం బాధాకరమని,ఈ ఘటనపై సమగ్రమైన విచారణ చేసేందుకు ఆ రాష్ట్రం తగిన చర్యలు తీసుకోవాలని జాహ్నవి విద్యా సంస్థల వైస్ చైర్మన్ లక్ష్మి కోరారు. వైద్యురాలిపై లైంగిక దాడికి పాల్పడి, హత్య చేయడాన్ని నిరసిస్తూ గురువారం నారాయణగూడలో జాహ్నవి డిగ్రీ,పీజీ కాలేజీ విద్యార్థినులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ నిత్యం ఎక్కడో ఒక చోట మహిళలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని,ఎన్ని చట్టాలు ఉన్నప్పటికీ అనేక కారణాలతో ఘటనకు బాధ్యులైన వారు తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జూనియర్ మహిళా వైద్యురాలిపై సభ్య సమాజం తలదించుకునే విధంగా లైంగిక దాడికి పాల్పడి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలకు భద్రత కరువైందని,దారుణమైన నేరాలు చోటు చేసుకుంటున్నాయని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్స్, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మత బోధనలు చేయడం సరికాదు

హిమాయత్‌నగర్,ఆగస్టు29: శాస్త్రీయ దృక్పథాన్ని దెబ్బతీసేలా రాష్ట్ర ఎస్సీ గురుకుల కార్యదర్శి అలుగు వర్షిణి వ్యవహరించడం సరికాదని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీకాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధర్మేంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాలలో చదివే విద్యార్థులకు మానసిక ఉల్లాసాన్ని పెంపొందించే సైకాలజీ తరగతులను బోధించేందుకు బ్రహ్మకుమారీస్ సంస్థతో సెప్టెంబర్ 2న చేసుకునే ఒప్పందాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గురుకుల విద్యాలయాల్లో చదువుకునే విద్యార్థుల ఆరోగ్యం,వారికి మౌలిక సదుపాయాలను కల్పించకుండా గాలికి వదిలివేసి మత బోధనను అమలు చేసేందుకు కార్యదర్శి అలుగు వర్షిణి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. విద్యార్థులు మానసికంగా ఒత్తిడికి గురైతే వారికి సైకాలజిస్టులతో అవగాహన కల్పించాలే తప్ప ఆధ్యాత్మిక భావజాలాన్ని విద్యార్థుల్లో నింపవద్దన్నారు. బ్రహ్మకుమారీస్ సంస్థతో చేసుకునే ఒప్పందాన్ని ఉపసంహరించుకోవాలని లేని పక్షంలో నిరసన ప్రదర్శనలు,ఆందోళనలను నిర్వహిస్తామని హెచ్చరించారు.

మధుబన్ కాలనీలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 29: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మధుబన్ కాలనీ శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి గురువారం భూమి పూజ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి పునాదులు వేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయాన్ని అధునాతన పద్ధతిలో అభివృద్ధి చేస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా భారీ ఎత్తున దేవాలయ నిర్మాణం కొనసాగుతుందన్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేస్తామని తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలు అవసరం

జూబ్లీహిల్స్,ఆగస్టు29: విద్యార్థుల మానసిక ఉల్లాసానికి, ఆరోగ్యానికి క్రీడలు దోహదపడతాయని.. విద్యతో పాటు క్రీడలు అవసరమని ఎస్ఎస్ఎస్‌వీ పాఠశాల ప్రెసిడెంట్ భవానీ శంకర్ పేర్కొన్నారు. ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని గురువారం యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయి సరస్వతి విద్యానికేతన్ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉషా మీనాక్షి, పీఈటీలు కిరణ్, ఉదయశ్రీ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేసిన అధ్యాపకులు

వ్యవసాయ యూనివర్సిటీ , ఆగస్టు 29: క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయని ఉద్యానకళాశాల అసోసియేట్ డీన్ డా. కిరణ్ అన్నారు. గురువారం ప్రపంచ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఆవరణలో విద్యార్థులకు వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. 5కేవీ రన్ నిర్వహించి ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఓఎస్ఏ డా. నాగహర్షిత తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

సీఎం రేవంత్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న యూనియన్ నేత సబ్బు రాజమౌళి

హిమాయత్‌నగర్,ఆగస్టు29: రాష్ట్ర వ్యాప్తంగా టూరిజం సంస్థలో 23 ఏండ్లుగా కాంట్రాక్టు,ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే 170 మంది కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, జాతీయ కౌన్సిల్ సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ టూరిజం కార్పొరేషన్ కాం ట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రతినిధులు గురువారం సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా యూ నియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సబ్బు రాజ మౌళి మాట్లాడుతూ ఏండ్ల తరబడి సంస్థను నమ్ముకుని చాలీచాలని వేతనాలు పొందుతూ కాంట్రాక్టు కార్మికులు పని చేస్తున్నారని,వీరికి సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు.సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, బాలమల్లేశ్ పాల్గొన్నారు.

ఓవర్ ఫ్లో సమస్యకు బకెట్ క్లీనింగ్‌తో చెక్

క్లీనింగ్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి

జూబ్లీహిల్స్,ఆగస్టు29: డైనేజీ ఓవర్ ఫ్లో సమస్య పరిష్కారానికి జీహెచ్‌ఎంసీ అధికారులు బకెట్ క్లీనింగ్ పనులు చేపట్టడంతో ఆయా సమస్యలు సత్వరమే పరిష్కారమవుతున్నాయని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తెలిపారు. గురువారం డివిజన్‌లోని శ్రీరామ్ నగర్‌లో బకెట్ క్లీనింగ్ మిషన్‌తో చేపడుతున్న పూడికతీత పనులను పరిశీలించారు. స్ట్రామ్ వాటర్, సీవరేజీ లైన్ల వ్యర్థాలతో నిండటంతో వర్షాలు కురిసినప్పుడు మార్కెట్‌లో ఓవర్ ఫ్లో సమస్యలు ఎక్కువవుతున్నాయని తెలిపారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 29: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ నాయకుడు సంతోష్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ సాయిబాబానగర్‌లో ఉచిత హెల్త్ క్యాంప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొన్ని రోజులుగా డెంగ్యూ, మలేరియా తదితర వ్యాధులు ప్రబలుతున్నాయన్నారు. ఇందులో భాగంగా సాయిబాబానగర్‌లో నిరుపేదలు ఎక్కువగా నివసిస్తున్న నేపథ్యంలో వారికి ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఏర్పాటు చేయించి వైద్య పరీక్షలు చేయడం జరిగిందన్నారు. డాక్టర్ వందన, పీహెచ్‌ఎం గౌరీ, ఏఎన్‌ఎం ప్రేమదేవి, ఆశ కార్యకర్త సరిత, కాలనీవాసులు శేఖర్, సాగర్, సంతోష్, మహేశ్ పాల్గొన్నారు.

స్పా సెంటర్ పై దాడి..కేసు

వెంగళరావునగర్, ఆగస్టు 29 :నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న స్పాసెంటర్ పై గురువారం మధురానగర్ నగర్ పోలీసులు దాడి చేశారు. ఇన్‌స్పెక్టర్‌శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం..ఎస్ఆర్ నగర్ బజాజ్ షోరూం సమీపంలో ఉండే యాపిల్ బ్యూటీ సెలూన్ అండ్ స్పా సెంటర్ పై దాడి చేశారు. కస్టమర్ల వివరాలను నమోదు చేసే రిజిస్టర్‌ను నిర్వహించకపోవడం, సీసీ కెమెరాలను సరైన తరహాలో ఏర్పాటు చేయకపోవడం, నిబంధనలకు లోబడి ఉండకపోవడంతో నిర్వాహకుడు నవీన్ గౌడ్ పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

విద్యార్థులు విలువలను పెంపొందించుకోవాలి

అనంత అస్తిన్య ప్రభుకు సత్కారం చేస్తున్న అధ్యాపకులు

హిమాయత్‌నగర్,ఆగస్టు29: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకునేందుకు మానవీయ విలువలు ఎంతో అవసరమని అత్తాపూర్ ఇస్కాన్ సంస్థ ప్రతినిధి అనంత అస్తిన్య ప్రభు, బాబు జగ్జీవన్‌రామ్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ అన్నారు.గురువారం నారాయణగూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో మానవీయ విలువలు-వృత్తి నైపుణ్యాలు అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో అంతరించిపోతున్న మానవీయ విలువలను పెంపొందించడం వల్ల మెరుగైన సమాజం నిర్మాణం సాధ్యమవు తుందన్నారు.విద్యతో పాటు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు ఎన్.రామలక్ష్మి,డాక్టర్ ఎస్.దీపిక,డాక్టర్ కాకునూరి నారాయణ మూర్తి, డాక్టర్ హెచ్.కిషన్,డాక్టర్ లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

చోరీకి గురైన 35 సెల్ ఫోన్లు రికవరీ

ఫోన్లను బాధితులకు అందజేసిన ఎస్ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

వెంగళరావునగర్, ఆగస్టు 29: పోగొట్టుకున్న,చోరీకి గురైన సెల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్(సీఈఐఆర్)సాంకేతికతతో సత్ఫలితాలు వచ్చాయి. ఫోన్లను బాధితులకు అందజేశారు. ఆగస్టు నెలలో బాధితుల నుంచి అందిన ఫిర్యాదుల మేరకు 35 సెల్ ఫోన్లను రికవరీ చేసి గురువారం బాధితులకు అందజేశారు. ఎస్.ఆర్ నగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సెల్‌ఫోన్‌లు వాడుతున్నవారిని గుర్తించి వారి వద్ద నుంచి 35 విలువైన ఫోన్లను స్వాధీనం చేసుకుని బాధితులకు అందజేశారు.పోయిన తమ ఫోన్లను తిరిగి అందజేసిన పోలీసులకు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్,ఎస్సై రాజు రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

రాధా హత్య ఘటనపై సమాధానం చెప్పాలి

మాట్లాడుతున్న ప్రొఫెసర్ మురళీ మనోహర్

ఖైరతాబాద్, ఆగస్టు 29 : మావోయిస్టు చేతుల్లో హత్యకు గురైన దళిత యువతి బంటి రాధా ఘటనపై పౌర హక్కుల సంఘాలు సమాధానం చెప్పాలని ప్రొఫెసర్ మురళీ మనోహర్ డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పొద్దున లేస్తే పౌర హక్కుల గురించి మాట్లాడే వారు ఓ దళితురాలిని మావోయిస్టులు అతి కిరాతకంగా హత్య చేస్తే మాట్లాడకపోవడం దారుణమన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ వంశ తిలక్, ఏబీవీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణపై అవగాహన కల్పించాలి

మాట్లాడుతున్న డీసీ జాకియా సుల్తానా

జూబ్లీహిల్స్,ఆగస్టు 29 : దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులు ప్రతిరోజు తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని జీహెచ్‌ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా సూచించారు. గురువారం యూసుఫ్‌గూడ శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయిరామ్ స్కూల్‌లో ఉన్నత పాఠశాల విద్యార్థులకు దోమల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఎంఓహెచ్ డాక్టర్ సాల్మన్, ఎంటమాలజీ ఏఈ సావిత్రి, ఈఎఫ్ఏ వినయ్, ఉపాధ్యాయులు , సిబ్బంది పాల్గొన్నారు.

డెంగీ లక్షణాలుంటే అప్రమత్తమవ్వాలి

జూబ్లీహిల్స్,ఆగస్టు29: డెంగీ లక్షణాలుంటే వెంటనే అప్రమత్తమవ్వాలని.. రోగుల నుంచి శాంపిల్స్ సేకరించాలని 18 వ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ప్రశాంతి సూచించారు. గురువారం జూబ్లీహిల్స్ డివిజన్ ప్రతాప్‌నగర్ బస్తీ దవాఖానను సందర్శించి డెంగీ కేసుల వివరాలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఏఎంఓహెచ్ డాక్టర్ భార్గవ్ నారాయణ, అధికారులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

జూబ్లీహిల్స్,ఆగస్టు29: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అభివృద్ధి పనులు చేపట్టాలని జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేశ్ పేర్కొన్నారు. ఫిలింనగర్‌లోని వినాయక నగర్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరైన రూ.20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వినాయక చవితి ఉత్సవాలు వస్తున్నందున జీహెచ్ ఎంసీ అధికారులు త్వరితగతిన పనులు పూర్తిచేయాలన్నారు. ఏఈ వెంకటేశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ జయచంద్ర, బీఆర్ఎస్ పార్టీ నాయకులు రమేశ్, దయానంద్, శెట్టి, మనోహర్, సూరి పాల్గొన్నారు.

ఏసీబీ అంటూ డబ్బులు వసూలు

బండ్లగూడ,ఆగస్ట్ 29: అవినీతి నిరోధక శాఖ పోలీసులమని చెప్పి డబ్బులు వసులు చేస్తున్న ఇద్దరిని అత్తాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు.ఎస్సై వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం..పింట్‌టీ కాలనీకి చెందిన ఎస్ ఎం ముజాహిద్,చాంద్రాయన్‌గుట్టకు చెందిన అబ్దుల్ రెహమాన్‌లు కలిసి అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివరాంపల్లి ప్రశాంత్ నగర్‌కు చెందిన రాహుల్ వర్దన్‌గౌడ్ వద్దకు ఈ నెల 26న వచ్చి తాము అవినీతి నిరోధక శాఖ పోలీసులమని చెప్పారు. ఇందులో ఒకరు వీడియో తీస్తున్నట్లు నటించి మీ దుకాణంలో అక్రమంగా ఇతర వస్తువులు అమ్ముతున్నట్లు తమకు సమాచారం వచ్చినట్లు తెలిపారు. పది వేల రూపాయలు ఇస్తే వెళ్లి పోతామని లేదంటే వీడియోను వైరల్ చేస్తామని హెచ్చరించారు.దీంతో రాహుల్ బయపడి రూ. 3 వేలు ఇవ్వగా మిగితా డబ్బుల కోసం వారు ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడ్డారు.రాహుల్ అత్తాపూర్ పోలీసులను ఆశ్రయించి జరిగిన విషయం తెలిపి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని వారిని అరెస్ట్ చేశారు.

ఆదిభట్ల నారాయణదాసు జయంతి

ఖైరతాబాద్, ఆగస్టు 29 : ఆదిభట్ల కళాపీఠం ఆధ్వర్యంలో సోమాజిగూడలోని టోపాజ్ భవనంలో శ్రీమద జ్జాడ ఆదిభట్ల నారాయణదాసు 160వ జయంతి వేడుకలు ప్రారంభమయ్యాయి. పద్మశ్రీ డాక్టర్ ఎల్లా వెంకటేశ్వర రావు, ప్రముఖ ఆధ్యాత్మికవేత్త డాక్టర్ అనంతలక్ష్మి, కళాపీఠం వ్యవస్థాపకురాలు కరాటే కల్యాణితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సినీనటుడు అన్నపూర్ణ, రఘుబాబు, పృథ్వీరాజ్, జమలాపురం లక్ష్మిగణపతి రావు, శ్రీనివాస్ వర్మ తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

బండ్లగూడ,ఆగస్టు 29 : డెంగీ పై అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మేయర్ మద్దెల లత పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ లత అధ్యక్షతను డెంగీపై సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కమిషనర్ శరత్‌చంద్ర, బస్తీ దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు

మైలార్‌దేవ్‌పల్లి, ఆగస్టు 29: అత్తాపూర్ డివిజన్‌లో వర్షాలకు దెబ్బతిన్న రహదారుల మరమ్మతు పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ వెంకన్న వెల్లడించారు. గురువారం డివిజన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పర్యటించారు. మూసీనదిలో గుర్రపు డెక్కను తొలగించడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నరేందర్‌గౌడ్, ఎంటమాలజీ అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ ఉద్యోగుల నిరసన

ఖైరతాబాద్, ఆగస్టు 29 : డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నాన్ టీచింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'డిమాండ్స్